క్లుప్తంగా

'మమ్ముల' ఎన్నికపై హర్షం

సీతానగరం: ఆర్యవైశ్య సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా సీతానగరం గ్రామానికి చెందిన మమ్ముల విశ్వేశ్వరరావు ఎన్నిక పట్ల వాసవీక్లబ్ జోనల్ కన్వీనరు ఆరిశెట్టి వెంకటసత్యనారాయణ, ఆర్యవైశ్య సేవా సంఘం మండల శాఖకు చెందిన కూర్మదాసు లక్ష్మణరావు, ఏవీ సత్యనారాయణ, వాసవీ క్లబ్ మండల కన్వీనరు ఆరిశెట్టి గోవిందరావు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి, పేదలకు దశాబ్దాలుగా సేవలు అందించిన విశ్వేశ్వరరావును అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం జిల్లా కేంద్రంలోని గిరిజన సామాజిక భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు గిరిజన సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన సంస్థల్లో ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్ సాధన కోసం కార్యాచరణ రూపొందించడం కోసం ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన సంఘాలకు చెందిన నాయకులు, ప్రతినిధులంతా హాజరవ్వాలని కోరారు.

రైతుల సహకారంతోనే ఈ పంట నమోదు



ఈ పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: ఈ పంట నమోదుకు రైతులు సహకరించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. అంటిపేట, కాశీపేట, రామవరం, ఆర్.వెంకంపేట, గుచ్చిమి, జోగింపేట గ్రామాల పొలాల్లో వ్యవసాయ సహాయకులు చేస్తున్న ఈ పంట నమోదులో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో ఈ పంట నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించాలని సూచించారు. ఈ పంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వార్షిక తనిఖీలు



కేజీబీవీలో ఉపాధ్యాయినిలకు సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వార్షిక తనిఖీని డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలల్లో తరగతుల బోధనలు, ఉపాధ్యాయుల పాఠ్యాంశాల బోధన ప్రణాళికలు, ట్యాబ్‌ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ బి.చంద్రశేఖర్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం జెడ్పీహెచ్ఎస్‌ల హెచ్ఎంలు బి.భీముడు, టి.శంకరరావు తదితరులు ఉన్నారు.

బస్టాండ్ ప్రారంభం



బస్టాప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గణేశ్వరరావు

సాలూరు: పట్టణంలోని శివాలయం రోడ్డు సమీపంలో జేబీఎస్ బస్టాప్‌ను ప్రముఖ వైద్యులు డా.వాడాడ గణేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. 1973లో సాలూరు లయన్స్ క్లబ్ ద్వారా జర్జాపు నీలకంఠం ఈ బస్టాప్‌ను నిర్మించారు. తరువాత ఇది మరమ్మతులకు గురికాగా నీలకంఠం కుమారుడు జర్జాపు ఈశ్వరరావు సుమారు లక్ష రుపాయిలు ఖర్చు చేసి దీనికి మరమ్మతులు చేపట్టి ఆధునీకరించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై సమాచారం ఇవ్వండి

గుమ్మలక్ష్మీపురం: గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకోట్రోపిక్ పదార్థాల రవాణా, అమ్మకాలపై ప్రజలు తమకు సమాచారం అందివ్వాలని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం వివిధ సారా కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాల వేలం పాట కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పాలకొండ డివిజన్లో గంజాయి, ఎన్‌డీపీఎస్ రవాణా జరుగకుండా నిఘా ఉంచామన్నారు. అందులో భాగంగానే బత్తిలి, ఎల్విన్‌పేట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, 24/7 పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా.. అమ్ముతున్నట్లు తెలిసినా యువత, భావితరాల జీవితాలు రక్షించేందుకు తక్షణమే తమకు సమాచారం అందివ్వాలని కోరారు. ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కలిసి పనిచేద్దాం

- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కలిసి పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. క్యాంప్ కార్యాలయంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన అంశాలపై అందరితో చర్చించి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించి క్షేత్ర స్థాయిలో అమలు చేయనున్నట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. రానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు అందరం కలసికట్టుగా పని చేయడం ద్వారా మరింత బలోపేతం చేద్దామన్నారు. ఇందుకు క్షేత్ర స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని అన్నారు. సెప్టెంబర్ 2న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీ గ్రామం, వార్డు నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, పాలవలస మురళీకృష్ణ, ఎంపీపీలు గుడివాడ నాగమణి, మజ్జి శోభారాణి శేఖర్, బలగ శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపీపీలు వెలిది సాయిరాం, సిద్ధ జగన్నాథం, ఎక్స్ సీడీసీ చైర్మన్ ఎన్.రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు, మూడు మండలాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటుపై అసంతృప్తి



ఎంఆర్‌సీలో పని సర్దుబాటు చేస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అసంపూర్తిగా జరిగింది. మండలంలో నాలుగు స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు సంబంధించి ఒకటి మాత్రమే భర్తీ అయ్యింది. ఎంఈఓ 1 సామల సింహాచలం ఆధ్వర్యంలో బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్, గలావల్లి ఉన్నత పాఠశాలలో లెక్కలు, హిందీ, ఇంగ్లిష్‌ల సబ్జెక్టులకు సంబంధించి పని సర్దుబాటు చేసేందుకు సర్‌ప్లస్ ఎస్‌జీటీలు, ఎంటీఎస్‌లను కలిపి 45 మందిని కౌన్సెలింగ్‌కు మంగళవారం పిలిచారు. వీటిలో విద్యార్హతల ప్రకారం స్కూల్ అసిస్టెంట్లను భర్తీ చేసేందుకు ఉపాధ్యాయుల జాబితాను తయారు చేశారు. ఈ జాబితా ప్రకారం సీనియర్లు అక్కడకు వెళ్లేందుకు నిరాకరిస్తే జూనియర్లు తప్పనిసరిగా వెళ్లాల్సి ఉంది. ఈ సర్దుబాటు సీనియర్లు నిరాకరించడంతో ఎంటీఎస్‌లపై భారం పడింది. గలావల్లిలో హిందీ, ఇంగ్లిష్, లెక్కలు స్కూల్ అసిస్టెంట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. ఎంటీఎస్‌లను కౌన్సెలింగ్‌కు పిలవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రవీందర్‌రాజు

పార్వతీపురం టౌన్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పార్వతీపురం టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రాజు అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలు వాడడం వలన ప్రాణాలను కోల్పోతారని తెలియజేశారు. లైసెన్సు లేనివారు వాహనాలు నడపరాదని హెచ్చరించారు. విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా ఎవరు ఇబ్బందులు పెట్టినా 100 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ వికాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్ బేస్‌డ్ పరీక్షలు



ట్యాబ్ బేస్‌డ్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీ విద్యాలయంలో టెన్త్ (సీబీఎస్ఈ) విద్యార్థులకు మేథ్స్ సబ్జెక్ట్‌పై ట్యాబ్ బేస్‌డ్ పరీక్ష నిర్వహించినట్టు ఎంఈఓ జి.సూరిదేముడు తెలిపారు. జోగింపేట కేజీబీవీలో ప్రిన్సిపాల్ జె.సంధ్య ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన సీబీఎస్‌సీ బేస్‌డ్ పరీక్షల కేంద్రాన్ని ఎంఈఓ మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు రాయడం వలన భవిష్యత్‌లో పోటీ పరీక్షల్లో పాల్గొనే వారికి సెంట్రల్ సిలబస్‌పై ఒక అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానం, పోటీ పరీక్షల్లో పాల్గొనే విధానంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏజెన్సీల అరాచకాలకు అడ్డుకట్ట వేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కుమార్

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థలైన వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ప్రాంతీయ ఆస్పత్రులు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో పారిశుద్ధ్యం, భద్రత, చెడ పురుగుల నివారణ, సూపర్‌వైజర్లను నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏజెన్సీల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో ఉన్న శానిటేషన్, సెక్యూరిటీ, చెద పురుగుల నివారణ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ప్రశ్నిస్తే ఒక నెల జీతం మాత్రమే ఇచ్చారన్నారు. వారికి సంబంధించిన పీఎఫ్ డబ్బుల జమలో కూడా తేడాలు ఉన్నాయన్నారు. సమావేశంలో ఆ సంఘం మన్యం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, కార్యవర్గ సభ్యుడు అలజంగి కుమారమ్మ, సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్‌వైజర్లు సంచాన శంకరరావు, ఎం.చంద్రమౌళి, బాలకృష్ణ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఉల్లిబద్రలో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు టీకాలు వేయడం వల్ల సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చునన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం, ఎండకు ఇబ్బందిపడటంతో డెక్కలలో పండ్లు ఏర్పడతాయన్నారు. ఆవులకు పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



రస్తా కుంటుబాయి కేవీకేలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో 'గిరిజన ప్రాంతంలోని అటవీ ఉత్పత్తులకు అదనపు విలువ' అనే అంశంపై గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు వారం రోజులుగా ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన వారికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీకే హోంసైన్స్ శాస్త్రవేత్త ఉమజ్యోతి మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులైన చింతపండు, ములక్కాడలు, బొప్పాయి తదితర ఉత్పత్తులతో పచ్చళ్లు, కేక్‌లు, లాలీపప్‌లు ఇతర తినుబండారాల వంటి విలువ ఆధారత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. శాస్త్రవేత్తలు ఎస్.స్రవంతి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : కలెక్టర్



నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: యువత అంకిత భావంతో పని చేస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిక్ టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన 47 మంది అభ్యర్థులకు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నియమాక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరాలనే అకుంఠిత దీక్షతో పని చేయాలన్నారు. ఒక నిర్దిష్ట లక్ష్యం, ఆశయంతో జీవితానికి సోపానాలు వేయాలని సూచించారు. పనిలో పట్టు సాధించాలని తద్వారా సంబంధిత పనిలో అద్భుతాలు సాధించవచ్చన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోబిక, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని హత్యాచారంపై నిరసన గళం



పార్వతీపురం టౌన్: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం టౌన్: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హత్యాచారంపై విద్యార్థి లోకం నిరసన గళం వినిపించింది. జరిగిన ఘటన దారుణమని భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. వైద్య విద్యార్థిని హత్యాచారాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైద్య విద్యార్థినిపై హత్యాచారం జరిగి రెండు వారాలవుతున్నా నేటికీ సమగ్ర దర్యాప్తు చేపట్టకపోవడం దారుణమన్నారు. కత్తువా, నిర్భయ, దిశ, మణిపూర్ ఘటనలతో దేశం అల్లాడిపోయిందని, నేడు జరిగిన ఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటన్నారు.

స్త్రీ వ్యవస్థపై జరిగిన దాడి

వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన భారతదేశ స్త్రీ వ్యవస్థపై జరిగిన దాడి అని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తుతుంటే కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు, డీవైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు డేవిడ్, అఖిల్, సురేష్, సింహాచలం, పట్టణంలో గల అన్ని విద్యా సంస్థల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బలిజిపేట: కోల్‌కత్తాలోని వైద్య విద్యార్థిని హత్యాచారానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా బలిజిపేటలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ వైద్య విద్యార్థినిని దుర్మార్గంగా చంపడాన్ని ఖండించారు. ప్రాణాలకు తెగొగ్గి ప్రజలకు సేవ చేసేటువంటి వైద్య వృత్తిని ఆదరించాల్సిన వారు ఒక విద్యార్థినిని అమానుషంగా హత్యచేయడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు జి.సత్యనారాయణ, సీపీఎం నాయకులు బి.భానుమూర్తి, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.



బలిజిపేట: నిరసనలో పాల్గొన్న మహిళలు

పీహెచ్‌సీ సందర్శన

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి పీహెచ్‌సీని విశాఖపట్నం మలేరియా జోనల్ మేనేజర్ శాంతిప్రియ మంగళవారం పరిశీలించారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. అనంతరం దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించగలమన్నారు. దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట డాక్టర్ శివకుమార్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

గిరిజన బాలుడు మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లక్కగూడ పంచాయతీ సదునుగూడ గ్రామానికి చెందిన స్వప్న, రాజ్‌కుమార్‌ల కుమారుడు బిడ్డిక రోహిత్ (10) అనారోగ్యంతో ఇంటి వద్ద మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబీకులు అందించిన వివరాల ప్రకారం సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న రోహిత్ రెండు రోజుల నుంచి కాస్త జ్వరంతో బాధపడుతున్నాడని, ఆస్పత్రికి తీసుకెళ్దామనుకునేలోపు ఘోరం జరిగిపోయిందని కన్నీటిపర్యంతమవుతున్నారు. రోహిత్ స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు.

పాఠశాలల పరిశీలన

సీతంపేట: స్థానిక కేజీబీవీ, మినీ గురుకుల పాఠశాలలను జీసీడీఓ రాములమ్మ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలికల డార్మిటరీ, తరగతి గదులను పరిశీలించారు. అలాగే విద్యార్థుల మెనూపై ఆరా తీశారు.

పరిశోధన ఫలితాలు రైతులకు అందాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: వ్యవసాయ పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేసినప్పుడే రైతుల ఆదాయం మెరుగు పడేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యాన, పౌల్ట్రీ, న్యూట్రీషన్ తదితర అంశాలలో చేస్తున్న పరిశోధనల గూర్చి శాస్త్రవేత్తలు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వాతావరణానికి అనువుగా ఉండే నూతన వంగడాలను అందించడంతో పాటు అవగాహనను రైతులకు కల్పించాలన్నారు. జిల్లాలో పైనాపిల్, పసుపు ప్రోసెసింగ్ యూనిట్లు స్థాపనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మన బడి - మన తోట కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతిగృహాల్లో ఆకు కూరలు, కాయగూరలు పండించేందుకు అవసరమైన విత్తనాలను అందించాలన్నారు. సాగు విధానంపై అవగాహన కల్పించేందుకు డాక్యుమెంటరీ ఫిల్మ్ రూపొందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ధృవ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



చినబోగిలిలో దోమల మందు పిచికారీ

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దోమల బెడద నుండి ప్రజలను రక్షించేందుకు మలాథియాన్ మందు ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నట్టు ఈఓపీఆర్‌డీఓ కె.కుమారవర్మ తెలిపారు. మంగళవారం పలు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల నివారణకు చేపట్టిన చర్యలను ఆయన పరిశీలించారు. ఈ మేరకు చినబోగిలి గ్రామంలో పంచాయతీ సర్పంచ్ కె.రాధ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి మనోహర్ వీధుల్లో దోమలు నివారణ మందు పిచికారీ చేయించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లున్న గ్రామాల్లో క్లోరినేషన్ చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: జిల్లా ఆస్పత్రిని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మంగళవారం పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను చూసి అసంతృప్తి వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులను విశాఖ, విజయనగరం రిఫర్ చేయకుండా స్థానికంగానే మెరుగైన వైద్యం అందిచేలా చర్యలు చేపట్టాలన్నారు.సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయచంద్ర